సాక్షి
అనంతపురం
గురువారం । 18 । జనవరి । 2024



సరిహద్దులో 'ప్రత్యేక' నిఘా

ఎన్నికల వేళ కర్ణాటక నుంచి మద్యం, డబ్బు జిల్లాలోకి రాకుండా సరిహద్దు ప్రాంతాల వద్ద పోలీసులు నిఘా పటిష్టం చేశారు. 10లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.7°/16.1°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

సావిత్రిబాయి పూలే విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో సావిత్రిబాయి పూలే విగ్రహ నిర్మాణానికి బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ భూమి పూజ చేశారు. విద్యతోనే స్త్రీ సాధికారత సాధ్యమని భావించి ఆ దిశగా అడుగులు వేసిన సావిత్రిబాయి పూలే విగ్రహానికి జెడ్పీ ఆవరణలో ప్రతిష్టించనుండడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, డిప్యూటీ సీఈఓ లలితబాయి, జెడ్పీటీసీ సభ్యులు హేమావతి, ప్రభావతి, నాగరాజు, మహేశ్, నాగార్జున, గోవిందరెడ్డి, హనుమంతు, జెడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మర్తాడు షేక్ రఫీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

కసాపురం
ఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకుంటున్న ఈఓ విజయసాగర్‌బాబు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓగా కె.విజయ్‌సాగర్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా కొనసాగుతున్న పట్టెం గురుప్రసాద్ కసాపురం ఆలయ ఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న తరుణంలో ఆయన స్థానంలో విజయ్‌సాగర్ బాబు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు స్వామివారి ఆశీర్వచనాలను అందజేశారు.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ నిర్వహణపై జేసీ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నైదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి అధికారుల సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఈ నెల 26న నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. అప్పగించిన బాధ్యతలను ఆయా శాఖల అధికారులు సజావుగా నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు తెలియజేసేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పరేడ్ మైదానంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ హనుమంతు, ఆర్డీఓ వెంకటేష్, డీపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురికి జైలు

నల్లచెరువు: దాడి కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ కదిరి జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ప్రతిమ బుధవారం తీర్పు చెప్పారు. ఎస్‌ఐ లింగన్న తెలిపిన వివరాల మేరకు.. 2016 జూన్ 19న అమడగూరు మండలం పుట్లవాండ్లపల్లికి చెందిన హరికృష్ణ తన సోదరుడు శ్రీనివాసులుతో కలిసి నల్లచెరువు మండలం గోరంట్లవారిపల్లిలోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. సోదరితో మాట్లాడాక అన్నదమ్ములిద్దరూ తిరిగి తమ స్వగ్రామానికి బయలుదేరారు. వీరు దామవాండ్లపల్లి సమీపంలోకి రాగానే పాత కక్షల నేపథ్యంలో డేరంగుల తిరుపాల్, డేరంగుల సోమశేఖర్, డేరంగుల శ్రీనివాసులు వారిని దారిలో అడ్డుకుని కొడవల్లు, ఇనుప రాడ్లు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు నల్లచెరువు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి ఎస్. ప్రతిమ ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు.

అభివృద్ధే అందరి లక్ష్యం





జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, చిత్రంలో కలెక్టర్ గౌతమి, హాజరైన ఎమ్మెల్యేలు శంకరనారాయణ, అనంత వెంకటరామిరెడ్డి, సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సభ్యులు, అధికారులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- అనుమానాలకు తావులేకుండా పనులు, నిధుల కేటాయింపు
- సస్పెండైన సీఈఓ సంతకాలతో అగ్రిమెంట్ల గడువు పెంపుపై నిలదీత

అనంతపురం సిటీ: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తున్నారు. ఆయన ఆశయాలకనుగుణంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతో అభివృద్ధికి కృషి చేయాలి. పనులు, నిధుల కేటాయింపులో ఎటువంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా చూసుకోవాలి' అని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ కొత్త సీఈఓ వైఖోమ్ నైదియా దేవి, డిప్యూటీ సీఈఓ లలితబాయి పాల్గొన్నారు. అనంతపురం అర్బన్, కదిరి, రాప్తాడు, పెనుకొండ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, మాలగుండ్ల శంకర్‌నారాయణ, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న హాజరయ్యారు. సభ్యులు తమ ప్రాంత సమస్యలను రాతపూర్వకంగా తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. గతంలో ఎలాంటి తీర్మానాలు లేకుండానే పనులు చేసేవారమని సభ్యులు సభలో వివరించారు. అయితే జెడ్పీ ముఖ్య అధికారులు మాత్రం ఎప్పుడూ లేని విధంగా గ్రామ పంచాయతీ, మండల తీర్మానాలు కావాలంటూ మెలిక పెట్టడం ఏమిటో అంతుబట్టడం లేదని జెడ్పీ చైర్‌పర్సన్ సహా సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల పనులు ముందుకు సాగక, అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా విభాగం అధికారుల వ్యవహార శైలిపై సభ్యులు ముక్తకంఠంతో నిలదీశారు. ఓఅండ్‌ఎం పనులకు సంబంధించి ఎన్ని అగ్రిమెంట్ల గడువు పెంచారనే వివరాలపై సమగ్ర విచారణకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆదేశించారు. గతంలో సస్పెండైన సీఈఓతో అగ్రిమెంట్లపై సంతకాలు పెట్టించారని నిలదీశారు. వాటిని రద్దు చేసి, కొత్త సీఈఓతో తీర్మానం చేయించాలని ఆమె ఆదేశించారు. గతంలో మాదిరిగానే ఎలాంటి తీర్మానం లేకుండా అభివృద్ధి పనులు మంజూరు చేయాలని తీర్మానం చేస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఈఈలను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కలెక్టర్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్ మాట్లాడుతూ బీటీ ప్రాజెక్టు నుంచి చెరువులకు నీరు వదలాలని కోరారు. ఇంకా పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ పోస్టులను స్థానికులకు కేటాయించాలని కోరారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లో ఓల్టేజీ నివారణపైనా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ కోరారు.

ప్రాధాన్యతను బట్టి బిల్లులు

బడ్జెట్‌తో పాటు పరిస్థితులు, అత్యవసరాలను దృష్టిలో పెట్టుకొని బిల్లులు చేస్తున్నామని కలెక్టర్ గౌతమి తెలిపారు. ఈ క్రమంలో కొన్ని పనులు ముందు జరిగినా బిల్లులు వెనక్కి పెట్టాల్సి వస్తుంటుందని, ఇందులో దురుద్దేశం ఏమీ లేదన్నారు. ప్రాధాన్యతను బట్టి బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అదనపు నిధులు రాగానే పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేస్తామని చెప్పారు. ప్రజారోగ్యంతో పాటు తాగునీటి సరఫరాకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఓఅండ్‌ఎం పనుల అగ్రిమెంట్లు పరిశీలన చేయిస్తామన్నారు. రహదారుల మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

- గ్రామ పంచాయతీ, మండల పరిషత్ తీర్మానం లేకుండానే పనులు మంజూరు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సీఎఫ్ఎంఎస్, పీఎఫ్ఎంఎస్ బిల్లులు నిబంధనల మేరకే అప్‌లోడ్ చేయిస్తున్నామన్నారు.

నీటి ఎద్దడి రానీయొద్దు

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. హెచ్ఎన్ఎస్ఎస్, ఆర్ డబ్ల్యూఎస్ కింద చేసిన పనులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల వివరాలు అందజేస్తే మేము కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ఓఅండ్‌ఎం, సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాలతో పాటు తాగునీటి పథకాలకు అత్యవసరంగా భావించి జెడ్పీ నిధులు కేటాయించారని, ఆ నిధులు తిరిగి ప్రభుత్వం నుంచి జెడ్పీకి అందించేలా తీర్మానం చేయండి.

– అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే అనంతపురం అర్బన్

టెండర్ల ప్రక్రియ పూర్తి చేయండి

రాప్తాడు పరిధిలో జలజీవన్ మిషన్ కింద 13 గ్రామాలకు సంబంధించి రూ.2.90 కోట్ల పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. వెంటనే టెండర్లు పిలవండి. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని 122 గ్రామాలకు తాగునీటి సరఫరా పనులకు పార్ట్-ఏ, బీ కింద టెండర్లు పిలవాలని రెండు నెలల కిందట నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ ప్రక్రియ పూర్తయ్యేలా చూడండి.

– తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాప్తాడు

అనంతవాసికి 'సాహస బాలుర' అవార్డు

- ఈ నెల 23న రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరణ



సూర్యప్రసాద్

అనంతపురం కల్చరల్: అనంతపురం అశోక్‌నగర్‌కు చెందిన రాగే శివప్రసాద్, రాగే ప్రమీల దంపతుల కుమారుడు సూర్యప్రసాద్ కేంద్ర ప్రభుత్వం అందించే సాహస బాలుర అవార్డుకు ఎంపికయ్యాడు. కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న సూర్యప్రసాద్ 2022లో యూరప్ ఖండంలోని మౌంట్ ఎల్‌బ్రోస్, టాంజానియా దేశంలోని కిలిమంజారో పర్వతాలను అధిరోహించాడు. ఆ ఏడాదే రాష్ట్ర ప్రభుత్వం సూర్యప్రసాద్ కుటుంబాన్ని అభినందిస్తూ రూ.6 లక్షలు అందించింది. ఈ నేపథ్యంలో నెహ్రూ యువకేంద్ర వారు ఏపీ తరఫున సూర్యప్రసాద్‌ను 2023 సంవత్సరానికి గాను బాలల అవార్డుకు నామినేట్ చేసింది. ఈ మేరకు కేంద్ర మహిళా, బాలల పరిరక్షణ శాఖ 'సాహస బాలుర అవార్డు'ను బుధవారం ప్రకటించింది. అవార్డు రావడంపై నెహ్రూ యువ కేంద్ర డీడీఓ శ్రీనివాస్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాతి భరత్ హర్షం వెలిబుచ్చారు. ఈ నెల 23న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన సూర్యప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, రాగే హరిత, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

సంక్రాంతి సెలవులు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలలకు సంక్రాంతి సెలవులు మరో రెండురోజులు పొడిగించారు. ఈ నెల 9 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఇచ్చారు. 19న పునఃప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఈ నెల 20 వరకు సెలవులు పొడిగించారు. 21న ఆదివారం కావడంతో 22న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని డీఈఓ వి.నాగరాజు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

జేఎన్‌టీయూ వీసీగా శ్రీనివాసరావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం నూతన వీసీగా ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్/ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపినట్లు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలారావు ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఆర్‌జీయూకేటీ (ఐఐఐటీ) నూజివీడు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ అయిన జీవీఆర్ శ్రీనివాసరావు బోధన, పరిశోధనలో విశేషానుభవం గడించారు. 2016లో బెస్ట్ టీచర్ అవార్డు దక్కించుకున్నారు. 2017లో ఆంధ్రా వర్సిటీ అందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ అకడమిషియన్ అవార్డు అందుకున్నారు. ఏపీ హెచ్ఈ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రా వర్సిటీల్లో పలు హోదాల్లో కీలక సేవలు అందించారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, వర్సిటీ ఇంజినీర్, ఎస్టేట్ ఆఫీసర్, ఉన్నత భారత్ అభియాన్ కమిటీ సభ్యులుగా విశేషమైన సేవలు అందించారు. నాలుగు రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేశారు. 17 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు ఈయన పర్యవేక్షణలో డాక్టరేట్‌లు అందించారు. 63 ఎంటెక్ ప్రాజెక్ట్‌లు చేశారు. 37 బీటెక్ ప్రాజెక్ట్‌లకు నేతృత్వం వహించారు. 15 ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహించారు. 37 జాతీయ సదస్సులకు అధ్యక్షత వహించారు. పాలనా పరమైన అంశాల్లో విశేషమైన అనుభవం, సమర్థత, పని పట్ల బాధ్యత, ఉన్నతాధికారుల పట్ల విధేయతగా ఉండడంతో వీసీగా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది వరకు వీసీగా ఉన్న ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఆయన జేఎన్‌టీయూఏ ప్రొఫెసర్ కావడంతో కలికిరి ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు.



ప్రణాళికబద్ధంగా కార్యనిర్వహణ



సాంకేతిక విద్యలో రాయలసీమకే తలమానికంగా ఉన్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీగా నియమితులవడం సంతోషదాయకం. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. ప్రణాళికాబద్ధంగా యూనివర్సిటీని ప్రగతిపథాన నడిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తా.

– జీవీఆర్ శ్రీనివాసరావు, నూతన వీసీ

జేఎన్‌టీయూ ప్రొఫెసర్ల బదిలీ

జేఎన్‌టీయూ(ఏ)లో పలువురు ప్రొఫెసర్లను బదిలీ చేశారు. వీసీ జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి. శశిధర్ ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పులివెందుల క్యాంపస్‌లో ఉన్న ప్రొఫెసర్ వసుంధరను జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలకు, కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న ప్రొఫెసర్ బి. లలితను జేఎన్‌టీయూ(ఏ)కు బదిలీ చేశారు. అలాగే కలికిరిలో కంప్యూటర్ సైన్సెస్ ప్రొఫెసర్‌గా ఉన్న ఎస్. నసీరాను అక్కడే విభాగాధిపతిగా నియమించారు.

ఎస్కేయూ వీసీగా హుస్సేన్‌రెడ్డి

- కెమిస్ట్రీ విభాగంలో విశేష బోధన, పరిశోధనానుభవం
- వివాదరహితుడిగా గుర్తింపు దక్కడంతో వీసీగా చాన్స్





వీసీగా బాధ్యతలు తీసుకుంటున్న హుస్సేన్‌రెడ్డి, నూతన వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన వీసీగా ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి నియమితులయ్యారు. చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఎంపిక మేరకు రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే యూనివర్సిటీలోనే కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా హుస్సేన్ రెడ్డి పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే గుణం, సమయస్ఫూర్తి, అందరితో సత్సంబంధాలు కలిగి ఉండడం, స్నేహపూర్వకంగా ఉండే మనస్తత్వం, వివాదరహితుడిగా గుర్తింపు పొందడంతో రాష్ట్ర ప్రభుత్వం హుస్సేన్‌రెడ్డిని వీసీగా ఎంపిక చేసింది. 32 సంవత్సరాల బోధనానుభవం, 37 సంవత్సరాల విశిష్టమైన పరిశోధనానుభవం ఉంది. 28 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఈయన పర్యవేక్షణలో డాక్టరేట్ పొందారు. ఇన్ ఆర్గానిక్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో నిష్ణాతులుగా ఖ్యాతి గడించారు. పేరెన్నికగల బహుళజాతి ఫార్మా కంపెనీలకు చెందిన ప్రముఖులు ప్రొఫెసర్ హుస్సేన్‌రెడ్డి వద్ద ఇండస్ట్రియల్ కోటాలో పీహెచ్‌డీ చేశారు. 6 మేజర్, 1 మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు నిర్వహించారు. 175 అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు. 60 పరిశోధనా వ్యాసాలు రాశారు. ఎస్కేయూలో 5 జాతీయ సదస్సులు నిర్వహించారు. 14 జాతీయ సదస్సులకు అధ్యక్షత వహించారు.

పాలనా వ్యవహారాల్లోనూ దిట్ట

కెమిస్ట్రీ విభాగాధిపతిగా మూడు సంవత్సరాలు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా మూడు సంవత్సరాలు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) ఫిస్ట్-ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా, ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ ఇన్‌చార్జ్‌గా, ఫార్మసీ విభాగం ప్రిన్సిపాల్‌గా, వైస్ ప్రిన్సిపాల్, వార్డెన్, అడిషనల్ వార్డెన్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. భారత ప్రభుత్వం ఫెలోషిప్‌తో కాలిఫోర్నియా శాన్ డిగోలో పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌ను 1989-90లో పూర్తి చేశారు. రూ.47.25 లక్షల వ్యయంతో పరిశోధన ప్రాజెక్ట్‌లు పూర్తి చేశారు.

బాధ్యతల స్వీకరణ

ఎస్కేయూ నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఆరు గంటలకు అంబేడ్కర్ పాలక భవనంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వి.రఘునాథ్‌రెడ్డి, ఆంటియా వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ పురుషోత్తం రెడ్డి, నాగభూషణం, సురేష్ రెడ్డి, యోగానందరెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, దుబ్బా శ్రీనివాసరెడ్డి, హేమంత్ కుమార్ తదితరులు నూతన వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

వర్సిటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతా

ఇదే యూనివర్సిటీలో ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశాను. ఇక్కడే సుదీర్ఘకాలం పాటు పనిచేసే అవకాశం వచ్చింది. ఇప్పుడు అత్యున్నత స్థానమైన వీసీగా రావడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. వర్సిటీలో ప్రతి అంశంపైనా అవగాహన ఉంది. పాలన, బోధన, పరిశోధన పరమైన అంశాలన్నింటిపై స్పష్టతతో ఉన్నాను. ఎస్కేయూను అగ్రగామిగా తీర్చిదిద్దుతా.

– ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, వీసీ, ఎస్కేయూ.

ఆ ఊరి పేరు ఇక 'శ్రీపురం'

గుత్తి రూరల్: గుత్తి మండలం కొజ్జేపల్లి గ్రామ పంచాయతీ పేరు శ్రీపురంగా మారింది. ఈ మేరకు జీఓ నంబర్ 542ను ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. గ్రామం పేరు చెప్పుకోవాలంటే అవమానంగా ఉందని, పేరు మార్చాలని గత కొన్ని దశాబ్దాలుగా గ్రామస్తులు పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలో 2018 జూన్ 5న 'గ్రామం తలెత్తుకొని.. పేరు దాచుకొని', 'కొజ్జేపల్లికి పరీక్ష' అంటూ సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం వచ్చింది. స్పందించిన అప్పటి సర్పంచ్ మహేశ్వరప్ప, గ్రామస్తులు అధికారులకు పలుమార్లు వినతి పత్రాలను అందజేశారు. అయితే అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టించుకోలేదు. అప్పటి గుంతకల్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు గ్రామం పేరు మార్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచాక కొజ్జేపల్లి పేరును మార్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామానికి శ్రీపురంగా పేరు మారుస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. గ్రామస్తుల కలను నెరవేర్చిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి సర్పంచ్ రామలింగమయ్య, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో భారీగా సంబరాలు జరుపుకున్నారు. పంచాయతీ కార్యాలయం ఎదుట బాణాసంచా కాల్చారు. కొజ్జేపల్లి గ్రామానికి శ్రీపురంగా పేరు మార్చేందుకు సహకరించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామంలో సంబరాలు చేసుకుంటున్న సర్పంచ్, గ్రామస్తులు

నేడు జన్‌భాగీదారి కార్యక్రమాలు



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: సామాజిక సమతా సంకల్పం (జన్ భాగీదారి)లో భాగంగా గురువారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ వివరాలను కలెక్టర్ బుధవారం వెల్లడించారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 206 అడుగుల డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారన్నారు. ఈ క్రమంలో జన్ భాగీదారిలో భాగంగా ఈ నెల 9 నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. గురువారం ఉదయం 7 గంటలకు నగరంలోని టవర్ క్లాక్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మారథాన్ ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు జిల్లావ్యాప్తంగా మానవహారాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం, రెవెన్యూ భవన్‌లో ఫొటో ఎగ్జిబిషన్ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే విధంగా మధ్యాహ్నం 1.30 గంటలకు జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. 19వ తేదీ విగ్రహావిష్కరణ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు రెవెన్యూ భవన్‌లో ఏర్పాట్లు చేశామన్నారు.

క్లుప్తంగా

పార్టీ విజయమే ధ్యేయం

- హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శాంత



మాట్లాడుతున్న శాంత

అనంతపురం టవర్‌క్లాక్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేస్తున్నారని ఆ పార్టీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త జె.శాంత అన్నారు. బుధవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్తగా పని చేసేందుకు అవకాశం కల్పించారన్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ పరిధిలోని ప్రతి పంచాయతీలో పర్యటించిన తనను ప్రజలు ఎంతో అభిమానంతో స్వాగతించారని గుర్తు చేశారు. పార్టీలో ఎలాంటి విభేదాలూ లేవని, అందరూ కలసి కట్టుగా పార్టీ విజయానికే కృషి చేస్తున్నారన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



కంబగిరి స్వామి (ఫైల్)

యాడికి: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన కంబగిరి స్వామి(43)కి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన... బుధవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా చిక్కేపల్లి బస్టాండ్ వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కంబగిరి స్వామిని కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై సీఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేశారు.

కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి చర్యలు

అనంతపురం సెంట్రల్: స్త్రీ, శిశు సంక్షేమశాఖకు అనుబంధంగా పనిచేస్తున్న శిశుగృహ, బాలల పరిరక్షణ సమితి(డీసీపీయూ) విభాగాల్లో ఖాళీగా ఉన్న సోషల్ వర్కర్(మహిళ), డాక్టర్ (పార్ట్ టైం) పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలను 'అనంతపురం వెబ్‌సైట్'లో అందుబాటులో ఉంచారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తును భర్తీ చేసి ఈ నెల 19 నుంచి 27వ తేదీలోపు ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో అందజేయాలి.

సరిహద్దులో 'ప్రత్యేక' నిఘా

- ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు
- డబ్బు, మద్యం, మాదకద్రవ్యాలు తరలింపుపై దృష్టి

బొమ్మనహాళ్/కళ్యాణదుర్గం/హిందూపురం అర్బన్: సాధారణ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో ఉమ్మడి జిల్లాలోని సరిహద్దు మండలాల్లో పోలీసుల నిఘా పెరిగింది. పొరుగున ఉన్న కర్ణాటక నుంచి డబ్బు, మద్యం, మాదకద్రవ్యాలు జిల్లాలోకి అక్రమంగా చొరబడకుండా సరిహద్దున ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 చెక్‌పోస్టులు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, రవాణా, అటవీ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో మొత్తం 19 ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. వీటితో పాటు క్రియాశీల తనిఖీ కేంద్రాలు, పెట్రోలింగ్, మొబైల్ తనిఖీలతో నిఘా విస్తృతం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో చిలమత్తూరు, హిందూపురం, అగళి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున చెక్‌పోస్టులు ఏర్పాటు కాగా, అనంతపురం జిల్లాలో డి.హీరేహాళ్, రాయదుర్గం మండలాల్లో ఒకటి చొప్పున, బొమ్మనహాళ్, విడపనకల్లు, బ్రహ్మసముద్రం, కంబదూరు మండలాల్లో రెండేసి చొప్పున, శెట్టూరు, కుందుర్పి మండలాల్లో ఏకంగా మూడేసి చొప్పున చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, అనంత ఎస్పీ అన్బురాజన్ పర్యవేక్షణలో సిబ్బంది నిఘా పటిష్టం చేశారు. ఆయా మార్గాల్లో సంచరిస్తున్న అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పొరుగు రాష్ట్రం నుంచి మద్యం, నగదు, గిఫ్ట్‌లు, మత్తు పదార్థాలు తరలి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అలాగే సరైన బిల్లులు, అనుమతి పత్రాలు లేకుండా సరుకు రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నారు.



వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన రూ.2.35 కోట్ల విలువైన సిగరెట్ల బండిళ్లను చూపుతున్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అనిత, ఉద్యోగులు (ఫైల్)

తనిఖీల్లో పట్టుబడుతున్న నగదు, సిగరెట్లు, మద్యం

- హైదరాబాద్–బెంగళూరు మార్గంలోని 44వ జాతీయ రహదారిపై అనంతపురం తపోవనం సర్కిల్ వద్ద ఈ నెల 14న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో రూ.2.35 కోట్ల విలువైన సిగరెట్ల అక్రమ రవాణా వెలుగు చూసింది. విచారణలో పాట్నా నుంచి బెంగళూరుకు తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. వాహనాన్ని సీజ్ చేసి, సిగరెట్ల బండిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై లోతైన విచారణ చేపట్టినట్లు జీఎస్టీ ఏసీ అనిత తెలిపారు.
- ఈ నెల 6న కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించిన స్కూటీ వాహనాన్ని కొడికొండ చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో రూ.10 లక్షల నగదు తరలిస్తున్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్కూటీలో నగదు తరలిస్తున్న కర్ణాటకలోని చిక్కబళ్లాపురానికి చెందిన మహమ్మద్ అలీని అదుపులోకి తీసుకుని నగదును సీజ్ చేసి ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు.
- ఈ నెల 12న కర్ణాటక నుంచి తూమకుంట చెక్‌పోస్టు మీదుగా అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దు మండలాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. కర్ణాటక మద్యం, నగదు, గిఫ్ట్ సామగ్రి అక్రమ తరలింపుపై నిఘా పెంచాం. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

– బి.శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఉమ్మడి జిల్లాలో చెక్‌పోస్టులు ఇలా...

మండలం	చెక్‌పోస్టు
చిలమత్తూరు	కొడికొండ
హిందూపురం	తూమకుంట
అగళి	బ్యాడగేరి
డి.హీరేహాళ్	ఓబుళాపురం
రాయదుర్గం	మొలకాల్మూరు
బొమ్మనహాళ్	బొల్లనగుడ్డం, బొమ్మనహాళ్
విడపనకల్లు	హావళిగి, విడపనకల్లు ఏపీఎంఎస్
బ్రహ్మసముద్రం	యరడిగెర, భైరవానితిప్ప
కంబదూరు	ఓబిగానిపల్లి, కంబదూరు
శెట్టూరు	అయ్యగార్లపల్లి, ములకలేడు, శెట్టూరు
కుందుర్పి	బెస్తరపల్లి, సీగలపల్లి, ఎన్.వెంకటంపల్లి

ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నాం



సార్వత్రిక ఎన్నికల్లు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో జిల్లా సరిహద్దున ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. కర్ణాటక నుంచి అక్రమ మద్యం, నగదు జిల్లాలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నాం. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే జిల్లాలోకి అనుమతిస్తున్నాం. అలాగే ఆయా వాహనాల సంచారాన్ని ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా నమోదు చేస్తున్నాం. కర్ణాటక నుంచి జిల్లాకు ఎక్కువ సార్లు తిరిగే వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాం.

– ఆంజనేయులు, ఎస్‌ఐ, బొమ్మనహాళ్

ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు సుదర్శన్

తాడిమర్రి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం మోదుగులకుంట ((తిరుమలాపురం) గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన సాకే నరసింహుడు కుమారుడు సుదర్శన్ (22) బీకాం వరకు చదువుకున్నాడు. అదే గ్రామానికి చెందిన సాకే గంగాధర్ కుమారుడు సాకే నరేంద్రతో కలసి వ్యవసాయ పనుల్లో కుటుంబానికి చేదోడు, వాదోడుగా ఉండే వాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సుదర్శన్ తన స్పోర్ట్స్ బైక్‌పై నరేంద్రతో కలసి తాడిమర్రికి వచ్చాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి 8 గంటల సమయంలో మోదుగుటకుంట సమీపంలోని పోతులయ్య స్వామి ఆలయం దాటగానే ముందు వెళుతున్న అదే గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో వేగ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే గుంతలోకి దూసుకెళ్లారు. ఘటనలో సుదర్శన్‌తో పాటు నరేంద్రకూ తీవ్ర గాయాలయ్యాయి. విష్ణువర్ధన్ నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సుదర్శన్ మృతి చెందాడు పరిస్థితి విషమంగా ఉన్న నరేంద్రను అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు సుదర్శన్ మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఘటనపై ఏఎస్‌ఐ సూర్యనారాయణరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం



నాయుడు మృతదేహం

గుత్తి: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం బేతాపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామచంద్ర, నాయుడు అలియాస్ చిన్నోడు (48) వ్యక్తిగత పనిపై బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై గుత్తికి చేరుకున్నారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమైన వారు స్థానిక అనంతపురం రోడ్డులోని హీరో షోరూమ్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కర్నూలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ద్విచక్ర వాహనం నడుపుతున్న నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రామచంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. నాయుడుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన రామచంద్రను తొలుత గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని ఎస్‌ఐ నబీరసూల్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోలే నరసమ్మ @100



పోలే నరసమ్మ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు

నల్లమాడ: మండలంలోని తిప్పయ్యగారిపల్లికి చెందిన పోలే నరసమ్మ వందో పుట్టిన రోజు వేడుకను కుటుంబ సభ్యులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆమె భర్త పోలే గంగిరెడ్డి 20 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. కుమారుడు చంద్రశేఖరరెడ్డి (ప్రస్తుతం ఈయనకు 80 సంవత్సరాలు), కుమార్తెలు శాంతమ్మ, పద్మావతమ్మ, జయమ్మ ఉన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి స్వగ్రామంలో వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారంతో నరసమ్మకు వందేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కుమారుడు, కుమార్తెలతో పాటు వారి సంతానం 50 మందికి పైగా పుట్టిన రోజు వేడుకకు హాజరయ్యారు. వీరిలో కెనడాలో స్థిరపడిన మునిమనవళ్లు, మనవరాళ్లు కూడా ఉన్నారు. నాలుగు తరాల సంతానాన్ని చూసి నరసమ్మ ఉబ్బితబ్బిబయ్యారు. పిల్లలు సైతం జేజ(నరస)మ్మకు స్వీట్లు తినిపిస్తూ ఆమెతో సెల్ఫీలు దిగి ఉత్సాహంగా గడిపారు.

చిరుత దాడిలో దూడ మృతి

పావగడ: తాలూకాలోని మంగళవాడ గ్రామంలో ఓ లేగ దూడను చిరుత తినేసిన ఘటన చోటు చేసుకుంది. బాధిత రైతు దొడ్డణ్ణ తెలిపిన మేరకు. .గ్రామం లోని కరియమ్మన దేవాలయం వద్ద పొలంలో ఏర్పాటు చేసుకున్న షెడ్‌లో రైతు ఆవు దూడలను కట్టేశాడు. బుధవారం వేకువజాము 2 గంటల సమయంలో షెడ్ లోకి ప్రవేశించిన ఓ చిరుత మగ దూడను నోట కరుచుకుని సమీపంలోని చింతచెట్టుపైకి ఈడ్చుకెళ్లింది. ఉదర భాగాన్ని పూర్తిగా తినేసి దూడ కళేబరాన్ని అక్కడే వదిలేసి వెళ్లింది. బుధవారం షెడ్ వద్దకెళ్లిన రైతు దొడ్డణ్ణ... అక్కడ చిరుత పాదాల గుర్తులు కనిపించడంతో అప్రమత్తమయ్యాడు. చెట్టుపై దూడ కళేబరాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ అధికారులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, మూడు రోజుల క్రితం గ్రామ శివారులో చిరుత సంచరించడాన్ని చూసినట్లుగా గ్రామస్తులు తెలిపారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన రైతు జయణ్ణ గొర్రెల దొడ్డిలోకి ప్రవేశించిన చిరుత ఏకంగా పది జీవాలను చంపేసిందని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఇప్పటికైన స్పందించి చిరుతను బంధించాలని కోరారు.

'అనంత'ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

నగరపాలక సంస్థ కమిషనర్ బయోడేటా

పేరు : ఎండూరి మేఘ స్వరూప్
సొంతూరు : కర్నూలు నగరం, కృష్ణానగర్
నాన్న : చంద్రశేఖర్ (పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ మేనేజర్, పంజాబ్)
అమ్మ : అరుణ (గృహిణి)
ఐఏఎస్ బ్యాచ్: 2021
సతీమణి : వైఖోమ్ నైదియా దేవి (జెడ్పీ సీఈఓ)



సాక్షి ఇంటర్వ్యూ

అనంతపురం కార్పొరేషన్: 'నగర ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పిస్తాం. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే ఉండదు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరా, వాయు కాలుష్యం నియంత్రణ తదితర అంశాలపై దృష్టి సారిస్తాను. అనంతపురం నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయం' అని కమిషనర్ ఎండూరి మేఘ స్వరూప్ స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: మీ కుటుంబ గురించి...?

కమిషనర్: సొంతూరు కర్నూలు నగరంలోని కృష్ణానగర్. నాన్న చంద్రశేఖర్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్. ప్రస్తుతం పంజాబ్‌లో పని చేస్తున్నారు. అమ్మ అరుణ గృహిణి. తమ్ముడు ఎంబీబీఎస్ పూర్తి చేసి, ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు.

సాక్షి: ప్రజాసేవ ఆలోచన ఎలా వచ్చింది?

కమిషనర్: తాతయ్య రామలింగారెడ్డి విశ్రాంత హెచ్‌ఎం. ఆయన నేర్పిన విలువలు నన్ను ఎక్కువ ప్రభావితం చేశాయి. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన చిన్నతనంలోనే నా మదిలో నాటుకుపోయింది. ఇక నా విద్యాభ్యాసం కర్నూలు, అనంతపురం జిల్లా గుత్తిలోనూ సాగింది.

సాక్షి: మీరు సాధించిన ర్యాంకులు..

కమిషనర్: 2019లో సివిల్స్ సర్వీసెస్‌లో 98వ ర్యాంకు వచ్చింది. మహారాష్ట్ర క్యాడర్‌లో ఐపీఎస్ శిక్షణ పూర్తి చేశాను. 2021 ఐఏఎస్ బ్యాచ్.

సాక్షి: తొలి పోస్టింగ్ ఎక్కడ?

కమిషనర్: ఐఏఎస్ శిక్షణ పూర్తి చేశాక చిత్తూరు జిల్లా అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్ ఇచ్చారు. అనంతరం మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో రెండు నెలలు అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించాను.

సాక్షి: పారిశుధ్యం మెరుగుకు తీసుకునే చర్యలు?

కమిషనర్: వివిధ డివిజన్ల నుంచి చెత్త సేకరణ పక్కాగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. కంపోస్టుకు చెత్త తరలించి, వాటి నిర్వహణకు చర్యలు చేపడుతాం. ముఖ్యంగా తడి, పొడి చెత్తను వేరు చేసేలా చర్యలు. చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

సాక్షి: అభివృద్ధి పనులపై మీ దృష్టి?

కమిషనర్: ప్రాధాన్యత క్రమంలో కాలువలు, రోడ్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జరుగుతున్న పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలుంటాయి. పన్ను వసూళ్ల సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. భవన నిర్మాణాలు, టైటిల్ ట్రాన్స్‌ఫర్స్, తదితర నగరపాలక సంస్థ అనుమతులు సకాలంలో జరిగేలా చూస్తాం.

సాక్షి: ప్రజలకు మీరిచ్చే సూచన?

కమిషనర్: ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి. అందులో ప్రజలు భాగస్వామ్యం తప్పనిసరి. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చెత్త తరలింపు వాహనాలకు అందించాలి. అప్పుడు చెత్త నిర్వహణ పూర్తి స్థాయిలో సాధ్యపడుతుంది. పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

సాక్షి: నగరాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కమిషనర్: మొదట ఇక్కడ పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంది. ప్రజావసరాలను గుర్తించి వారి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నగరంలో ఫుట్‌పాత్‌లు పూర్తి స్థాయిలో లేవు. వాటిని ఏర్పాటు చేసి ప్రజలు నడక మార్గాన వెళ్లేందుకు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేస్తాం.

జనవాక్కు

రైతు ముంగిటకే సేవలు



గత టీడీపీ ప్రభుత్వంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందక నానా ఇబ్బందులు పడ్డాం. విత్తనం కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలను రైతుల ఇంటి వద్దనే అందేటట్లు చర్యలు తీసుకున్నారు. విత్తనం మొదలు పంట విక్రయం వరకూ అన్నీ మా ఊళ్లోనే ఆర్‌బీకేల ద్వారానే సాగుతుండడంతో ఎంతో సంతోషదాయకం. నాణ్యమైన విత్తనాలు, ఎరువులూ ఊళ్లోనే అందిస్తున్నారు. పంట రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌బీకే సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. రైతు పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలు ఎంతో బాగున్నాయి. ఆయనకే మా మద్దతు.

– కుమ్మర శ్రీనివాసులు, రైతు, ఉదిరిపికొండ, కూడేరు మండలం

ఆర్థిక ఇబ్బందులు తీరాయి



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో మా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న కుమారుడు మీనుగ బాబుకు అమ్మ ఒడి పథకం వర్తించింది. వైఎస్సార్ కళ్యాణమస్తు కింద రూ. లక్ష సాయం అందడంతో కుమార్తె అంజలికి పెళ్లి చేయగలిగాను. సంక్షేమ పథకాలతో మా ఆర్థిక ఇబ్బందులు దూరం చేసిన సీఎం వైఎస్ జగనన్నకే మా మద్దతు.

– మారెక్క, తగ్గుపర్తి, బెళుగుప్ప మండలం

పేదరికాన్ని దూరం చేశారు



పేదరికంతో బాధపడుతున్న మాకు గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు వర్తించక చాలా ఇబ్బందులు పడ్డాం. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మా పేదరికం దూరమవుతూ వస్తోంది. అమ్మ ఒడి పథకం వర్తించడంతో మా కుమార్తె మేఘన స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుకుంటోంది. నా భార్య పేరుతో ఇంటి స్థలంతో పాటు పక్కా గృహ నిర్మాణం మంజూరైంది. ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. అమ్మ లాలెమ్మకు పింఛన్ అందుతోంది. ఇంతకంటే మేలు చేసే ప్రభుత్వం మరొకటి లేదు. కాబట్టి వచ్చే ఎన్నికల్లో జగనన్నకే మా ఓటు.

– ఏసుదాసు, వజ్రకరూరు

సొంతింటి కల నెరవేరింది



అద్దె ఇంట్లోనే 15 సంవత్సరాలుగా జీవిస్తున్నాం. సొంతింటి కోసం గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం దక్కలేదు. జన్మభూమి కమిటీలకు అందజేసిన దరఖాస్తులు అడ్రస్ లేకుండా గల్లంతయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మాలాంటి పేదలకు అండగా నిలిచింది. మా గ్రామ వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి వివరాలు తీసుకెళ్లి నాకు ఇంటి పట్టా తీసుకొచ్చి ఇచ్చాడు. అలాగే ప్రభుత్వం తరఫున పక్కా గృహ నిర్మాణం కూడా మంజూరైంది. ఇంటి నిర్మాణం జరుగుతోంది. త్వరలో సొంతింట్లోకి చేరుకోబోతున్నాం. మా సొంతింటి కలను నెరవేర్చిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– సహేరాబాను, కంబదూరు

25న ఏహెచ్‌ఏలకు పోస్టింగ్

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (ఏహెచ్‌ఏ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం బుధవారం 'సాక్షి'కి తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో భర్తీ చేయనున్న 473 ఏహెచ్‌ఏ పోస్టులకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 31న నిర్వహించిన ఎంపిక పరీక్షకు 919 మంది అభ్యర్థులు హాజరయ్యారు. డైరెక్టరేట్ పరిధిలోనే రోస్టర్, మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి పది స్థానాల్లో నిలిచిన ఏహెచ్‌ఏలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియామక పత్రాలు అందించే అవకాశం ఉంది. 473 పోస్టుల్లో నాన్‌లోకల్ కింద 51 మందికి అర్హత ఉంటుంది. అలాగే మొత్తం పోస్టుల్లో మహిళలకు 147 పోస్టులు కేటాయించారు. బుధవారం రాత్రికి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నందున... ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన ఈ నెల 22, 23న ఉంటుంది. ఇందు కోసం ఇప్పటికే ఐదు బృందాలను ఏర్పాటు చేశారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే రోస్టర్, మెరిట్ ఆధారంగా కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హత కలిగిన ఏహెచ్‌ఏలకు ఈ నెల 25న పోస్టింగ్ ఉత్తర్వులు అందజేయనున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుత్తి: కుటుంబ కలహాలు, అనారోగ్య పరిస్థితులను తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి ఆర్‌ఎస్‌లోని ఆంధ్రాబ్యాంక్ ఏరియాలో నివాసముంటున్న శివాజీ (32)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న యాన బుధవారం ఉదయం అందరూ చూస్తుండగానే తురకపల్లి బ్రిడ్జి వద్ద పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రఘునాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరులో 2, ముట్టాలలో 1, రంగంపేటలో 1 చొప్పున వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 24వ తేదీలోపు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్ మేఘ స్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అదనపు కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా ఎస్.మేఘ స్వరూప్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, వివిధ సెక్షన్ హెడ్స్ కమిషనర్‌కు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

ప్రొఫెసర్ శ్రీదేవి సేవలు మరువలేనివి



ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: ప్రొఫెసర్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి సేవలు మరువలేనివని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. ఇటీవల ఎస్‌పీఎం ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ శ్రీదేవికి పులివెందుల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించిన విషయం విదితమే. బుధవారం వైద్య కళాశాలలో డాక్టర్ శ్రీదేవికి అభినందన సభ ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో డాక్టర్ శ్రీదేవి మరిన్ని ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ షారోన్‌సోనియా, డాక్టర్ శ్యాంప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అవోపా వంటల పోటీలు



వంటలను రుచి చూస్తున్న న్యాయనిర్ణేతలు

అనంతపురం కల్చరల్: అవోపా (ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వంటల పోటీలు ఆకట్టుకున్నాయి. స్థానిక రాజురోడ్డులోని వైశ్యా హాస్టల్ ఎడుకేషనల్ ట్రస్టు ప్రాంగణంలో జరిగిన పోటీలకు అధిక సంఖ్యలో మహిళలు వచ్చి వంటలు చేశారు. ఈ సందర్భంగా అవోపా ప్రెసిడెంట్ అనురాధ, ప్రోగ్రాం కన్వీనర్ కాకుమాని చంద్రకళ, సెక్రెటరీ ఇందిర, ట్రెజరర్ భువన తదితరులు మాట్లాడారు. సంక్రాంతి పర్వదినాలు ముగిసిన తర్వాత అదే ఉత్సాహాన్ని కొనసాగించాలన్న లక్ష్యంతో పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం నోరూరించే వంట పదార్థాలను వినూత్నంగా తయారు చేసిన ముగ్గురు విజేతలతో పాటూ పలువురికి ప్రోత్సాహక బహుమతులనందించారు. వంట పోటీలకు శిరీష, ఉష న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేశ్వర్లు, అవోపా జిల్లా అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో అప్కాస్ కార్యాలయం ప్రారంభం



పాలక భవనంలో అప్కాస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం నూతన పాలక భవనంలో జేఎన్‌టీయూఏ-అప్కాస్ ఉద్యోగులు అసోసియేషన్ కార్యాలయాన్ని వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన బుధవారం ప్రారంభించారు. వర్సిటీ అభివృద్ధిలో అప్కాస్ ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమన్నారు. అనంతరం వీసీని అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ అప్కాస్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఓబుగారి శిరీష్ రెడ్డి, సెక్రెటరీ డి. వెంకట్రాముడు, ట్రెజరర్ డి.రహంతుల్లా, వైస్ ప్రెసిడెంట్ ఎం. క్రిస్టియ్యా, జాయింట్ సెక్రెటరీ ఏ.సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాలు వచ్చేస్తున్నాయ్

దశాబ్దాల తాగునీటి సమస్యకు పరిష్కారం

- పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీటి సరఫరాకు చర్యలు
- శరవేగంగా సాగుతున్న పనులు
- త్వరలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు
- రూ.95 కోట్ల నిధులు విడుదల



ఆత్మకూరు వద్ద ఉంచిన పైప్‌లు



ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామం వద్ద జరుగుతున్న పైప్‌లైన్ పనులు

ఆత్మకూరు: ఎన్నో దశాబ్దాలుగా ఆత్మకూరు మండల ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడ్డారు. ఎంతో మంది పాలకులు, ప్రజాప్రతినిధులు మారినా శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మండలంలో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కరిస్తామని గతంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం మండలంలో నీటి సమస్యకు పరిష్కారం చూపుతున్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మరో రెండు నెలల్లో మండలానికి తుంగభద్ర జలాలు రానున్నాయి. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి, తాగునీరు అందించనున్నారు.

కొనసాగుతున్న పనులు..

కూడేరు మండలం పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు నీరు అందించేందుకు పైప్‌లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పథకం మొత్తం వ్యయం రూ.95 కోట్లు కాగా.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం 50:50 శాతం చొప్పున నిధులు విడుదల చేశాయి. ఇందు కోసం ఆత్మకూరు మండలానికి రూ.54 కోట్లు, అనంతపురం రూరల్ మండలాలకు రూ.41 కోట్లు కేటాయించారు. 22 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులకు సంబంధించి ప్రస్తుతం మట్టి పనులు 6 కిలోమీటర్లు పూర్తి కాగా, పైప్‌లైన్ పనులు 4 కిలోమీటర్లు పూర్తయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.

రోజుకు 1.20 కోట్ల లీటర్ల నీరు సరఫరా..

ప్రస్తుతం రూ.95 కోట్లతో చేపడుతున్న పనులు పూర్తి అయితే రోజుకు 1.20 కోట్ల లీటర్ల నీరు సరఫరా అవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆత్మకూరు మండలానికి 18 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. అందులో ఆత్మకూరులో 2, కుర్లపల్లి 1, పి.యాలేరుకు 1, ముట్టాల 1, డీకే తండాకు 1, వై.కొత్తపల్లి 1, సింగంపల్లి 1, సింతంపల్లి తండాలో 1, పంపనూరు 1, పంపనూరు తండా 1, వడ్డుపల్లి 1, మదిగుబ్బ తండా 1, బి. యాలేరు 1, సనప 1, వేపచెర్ల దిగువ తండా 1, వేపచెర్ల ఎగువ తండా 1, తోపుదుర్తిలో 1 ఇలా 40 వేల లీటర్ల సామర్థ్యం నుంచి 2.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు నిర్మిస్తున్నారు. పీఏబీఆర్ డ్యాం వద్ద 1, కూడేరు మండలం నారాయణపురం దగ్గర 1, ఆత్మకూరు వద్ద 1 చొప్పున సంపుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరులో 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు, పంపనూరులో లక్ష లీటర్ల ట్యాంకు, అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి క్రాస్ వద్ద లక్ష లీటర్ల ట్యాంకు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా మూడు పంపింగ్ రూమ్స్ కూడా నిర్మించనున్నారు.

నీరు అందించే గ్రామాలు ఇవే..

పైప్‌లైన్ పూర్తయితే రోజుకు 1.20 కోట్ల లీటర్ల నీరు సరఫరా అవుతాయి. అందులో ఆత్మకూరు మండలానికి సంబంధించి 25 గ్రామాలకు రోజుకు 35 లక్షల లీటర్లు, అనంతపురం రూరల్ మండలంలోని 31 గ్రామాలకు సంబంధించి రోజుకు 50 లక్షల లీటర్ల నీరు సరఫరా చేయనున్నారు. అదే విధంగా శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కొండపల్లి సమీపంలో ఉన్న సంపుకు రోజుకు 35 లక్షల లీటర్ల నీటిని పైప్‌లైన్ ద్వారా అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదే విధంగా కొండపల్లి నుంచి ఆర్‌డబ్ల్యూ ఎస్ పైప్‌లైన్ల ద్వారా కనగానపల్లి మండలంలోని 27 గ్రామాలు, రామగిరి మండలంలోని 27 గ్రామాలకు అక్కడ నుంచి ఉన్న పైప్‌లైన్ల ద్వారా రోజుకు 35 లక్షల లీటర్లు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

చాలా సంతోషం..



చాలా ఏళ్లుగా ఆత్మకూరులో తీవ్ర నీటి సమస్య ఉంది. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి, తుంగభద్ర జలాలు అందించేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. త్వరలో మా ఊరిలో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం కానుంది. – కుమారి, ఆత్మకూరు

ఇంటింటికీ కుళాయి ఏర్పాటు



పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు ప్రభుత్వం తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయం. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే రెండు లేదా మూడు నెలల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. – సుబ్బర హేమలత, ఎంపీపీ, ఆత్మకూరు

జగనన్న చొరవ వల్లే..



ఎన్నికల సమయంలో చాలా మంది నీటి సమస్య ఉందని నా దృష్టికి తీసుకొచ్చారు. శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆనాడు మాట ఇచ్చాం. చెన్నేకొత్తపల్లి సభలో జగనన్న దృష్టికి సమస్యను తీసుకెళ్లి వివరించాను. సీఎం జగన్ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. త్వరలో ఆత్మకూరు మండలానికి తుంగభద్ర జలాలు వచ్చేలా చూస్తాం. ఇప్పటికే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా. – తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గం

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు దేశానికే ఆదర్శం



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ వసీం, కమిషనర్ మేఘ స్వరూప్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: విజయవాడలో ఈనెల 19న సీఎం జగన్ ఆవిష్కరించనున్న 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం సామాజిక సమతా సంకల్పం సభకు సంఘీభావంగా నగరంలోని జెడ్పీ కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మేయర్ వసీం, కమిషనర్ మేఘ స్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం రావాలని భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏదైతే ఆకాంక్షించారో అదేవిధంగా దేశంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారన్నారు. జనరల్ స్థానాల్లో కూడా సామాజిక న్యాయం కింద బడుగులకు అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమంలో సింహభాగం బడుగు, బలహీన వర్గాలకే అందించారన్నారు. నగరంలో 50 మంది కార్పొరేటర్లలో 34 మంది కార్పొరేటర్లు, 5 మంది కో-ఆప్షన్ సభ్యులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందినవారే ఉన్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఈఈ సూర్యనారాయణ, డీఈలు సుభాష్, రవీంద్రరెడ్డి, దాక్షాయణి, ఏఈ బాబావలి, ఉమామహేశ్వరి, విజయ్‌బాబు, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, బాలాంజినేయులు, సాకే చంద్రలేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారంపై ప్రచారం



పోస్టర్లను విడుదల చేస్తున్న గుత్తి ఫారెస్ట్ అధికారులు

యాడికి: చందన గ్రామ సమీపంలో కొండల్లో ఎలుగుబంటి సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుత్తి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి సూచించారు. బుధవారం ఆయన గ్రామంలో ఎలుగబంటి సంచారంపై ప్రచారం నిర్వహించారు. ఎలుగు బంట్లకు చూపు, వాసన, వినికిడి తక్కువగా ఉంటుందని, రాత్రి పూట రహదారుల వెంట, పొదలగుండా వెళ్లేటప్పుడు శబ్దం చేసుకుంటూ పోవాలన్నారు. ఎలుగుబంట్లు ఎదురైతే వాటి కళ్లకు టార్చిలైటు వేస్తే దూరంగా పారిపోతాయన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఎఫ్‌బీఓలు మాదవి, రామాంజనేయులు, ఏబీఓలు మంజుల, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్‌ను బైక్‌తో ఢీ కొట్టిన ఘనుడు

గుత్తి: పట్టణ శివారులోని ప్యాపిలి రైల్వే గేట్‌ను బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీ కొట్టాడు. వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై కర్నూలు వైపు నుంచి గుత్తి వైపునకు బయలుదేరాడు. రైలు వస్తుండంతో ప్యాపిలి రైల్వే గేట్‌ను మూసేశారు. ఇది గమనించని వ్యక్తి వేగంగా వచ్చి రైల్వేగేట్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మద్యం సేవించి బైక్ నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన నందిని అనే మహిళ బుధవారం రాత్రి విష గుళికలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు ఆమెను అనంతపురం రెఫర్ చేశారు. కుటుంబ కలహాలతో ఆమె ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుత్తి పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన హేమంత్ అనే యువకుడు పని నిమిత్తం మంగళవారం అర్ధరాత్రి బైక్‌పై కొత్తపేటకు బయలుదేరాడు. బైపాస్ బ్రిడ్జ్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. గాయపడిన హేమంత్‌ను 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దూదేకుల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం టవర్‌క్లాక్: దూదేకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీ సత్యసాయి జిల్లా నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు ఫాతిమా అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలిగా ఫాతిమాను ఎన్నుకున్నారు. సత్యసాయి జిల్లాలో దూదేకులకు ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే సంఘం తరపున పరిష్కారానికి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షుడు దాదా ఖలందర్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు నబీరసూల్, ప్రధాన కార్యదర్శి పీఎండీ ఖలందర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు అల్లీపీరా, నాయకులు గఫూర్, రహీమ్, మస్తాన్‌వలి, నిజామ్, రామాంజి, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, అధికారులు హాజరు కావాలని కోరారు.

రూ.4 లక్షల విలువైన మద్యం కాల్చివేత

అనంతపురం క్రైం: పలు కేసుల్లో పట్టుబడిన మద్యంతో పాటు టెట్రాప్యాకెట్లకు బుధవారం సెబ్ పోలీసులు నిప్పు పెట్టి కాల్చేశారు. సుమారు రూ.4 లక్షల విలువ చేసే మద్యాన్ని నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో చెత్తకుప్పల వేసి కాల్చేశామని సెబ్ సీఐ రవీచంద్ర, సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ హాసీనా బాను తెలిపారు.

విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీలు



విధుల్లో చేరుతున్న సీకేపల్లి అంగన్‌వాడీ కార్యకర్త సునీత

చెన్నేకొత్తపల్లి: వేతనాలు పెంచాలంటూ సమ్మె చేస్తున్న పలువురు అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం సమ్మె విరమించి విధుల్లో చేరారు. మండలంలోని వెంకటంపల్లిలోని 4 అంగన్‌వాడీ కేంద్రాలు, మారుతిపురం, చెన్నేకొత్తపల్లిలోని 3, 2, నాగసముద్రం-1 పెనుగొండ వారిపల్లి ఎన్ఎస్ గేట్, పులేటిపల్లిలోని 2 అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మిగిలిన వారు కూడా విధుల్లో చేరాలని సూచించారు.

వర్సిటీ పురోగతిలో రంగజనార్దన ముద్ర



వీసీని సత్కరిస్తున్న రెక్టార్ ప్రొఫెసర్ విజయ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పురోగతిలో వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అరుదైన ముద్ర వేశారని పలువురు కొనియాడారు. వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాలులో వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దనను ఘనంగా సత్కరించారు. వీసీ పదవీ కాలం బుధవారం ముగియడంతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. తన మూడు సంవత్సరాల పదవీ కాలంతో ప్రతి ఉద్యోగి సహాయ సహకారాలు అందించారన్నారు. వర్సిటీలో పలు సంస్కరణలు అమలు చేసి అభివృద్ధి పథాన నిలిపినట్లు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 75వ వార్షికోత్సవాన్ని నిర్వహించడం అనుభూతిని ఇచ్చిందన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయ కుమార్ మాట్లాడుతూ.. క్యాంపస్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు తీసుకరావడానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో మంచి ర్యాంకు రావడానికి తోడ్పాటు అందించారన్నారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ అధ్యక్షత వహించారు. డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ అలివేలమ్మ

కనగానపల్లి: మండల కేంద్రంలో ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గ్రామ స్థాయిలో జరిగిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం నుంచి మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీడీఓ అలివేలమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో భానుకోట జట్టుపై ముక్తాపురం, యలకుంట్లపై పాతపాళ్యం జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

గుంతకల్లు రూరల్: మండలంలో మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినట్లు ఏఓ కే.స్వాతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంది, జొన్న ధాన్యం విక్రయించదలచిన రైతన్నలు సంబంధిత ఆర్బీకేల్లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జొన్న మాల్దండి రకం క్వింటా రూ. 3,225, హైబ్రిడ్ రూ.3,180 చెల్లిస్తుందని తెలిపారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

కణేకల్లు: మండలంలోని కణేకల్లు క్రాస్, కణేకల్లులో ఉన్న ఎరువుల దుకాణాలను కళ్యాణదుర్గం ఏడీఏ ఎన్పీ యల్లప్ప, కణేకల్లు ఏఓ శ్రవణ్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కణేకల్లుక్రాస్‌లోని కోరమాండల్, కిసాన్ అగ్రి క్లీనిక్ ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. కణేకల్లులోని ఆదర్శభారతి రైతుసేవా సహకార సంఘం ఫర్టిలైజర్, పీఏసీఎస్ ఫర్టిలైజర్‌షాపుతోపాటు పలుదుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. వివిధ షాపులో అనుమతులు (ఫాం ఓ) లేకుండా విక్రయిస్తున్న రూ.3.10 లక్షల విలువ చేసే ఎరువులను విక్రయించొద్దని ఆదేశించారు. అనుమతులు తీసుకొన్న తర్వాతే విక్రయించాలన్నారు. రైతులతో బయోమెట్రిక్ తీసుకొని ఎరువులు ఇవ్వాలని విక్రయాల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పని సరిగా అప్‌లోడ్ చేయాలని వారు ఆదేశించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: మండలంలోని భోగినేపల్లి గ్రామానికి చెందిన పలు టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. బుధవారం అనంతపురంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో కురుబ కర్రే నాగేంద్ర, కర్రే ముత్యాలప్ప, కర్రే వన్నూరప్ప, కర్రే రామలింగమయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నామన్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితోనే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బుక్కచెర్ల సొసైటీ అధ్యక్షుడు కుర్లపల్లప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు గుగ్గిళ్లా భాస్కర్ రెడ్డి, బిల్లే రామకృష్ణ, ఓబిరెడ్డి, వేణుగోపాల్, బోయ చిన్న మాదన్న, గొల్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ సంబంధ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి



డీఈఓ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరుగుతున్న ఎస్ఎస్‌సీ, ఇతర పరీక్షల డ్యూటీలు, ప్యానల్ ఇన్‌స్పెక్షన్లు, సైన్స్ సెంటర్ కార్యక్రమాల నిర్వహణలో ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు ప్రాధాన్యత కల్పించేలా చూడాలని ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సంఘం నాయకులు కోరారు. బుధవారం డీఈఓ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన డీసీఈబీ, డీవైఈఓ, ఇన్‌స్పెక్షన్, సైన్స్ సెంటర్ కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ హెచ్ఎం, ఎంఈఓలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని వాపోయారు. 12 సంవత్సరాలుగా అన్ని రకాల కార్యక్రమాల్లో తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఎస్ఎస్‌సీ, ఇతర పరీక్షల డ్యూటీలు, అన్ని విద్యాశాఖ సంబంధ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ హెచ్ఎం, ఎంఈఓల సంఘం గురుప్రసాద్, రామచంద్ర, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సద్వినియోగం చేసుకోండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని బుడ్డప్పనగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి దశలో ఎంత మంది ప్రజలకు సేవలందించారు? ప్రస్తుతం జరుగుతున్న రెండో దశలో అందుతున్న సేవలపై డీఐఓ డాక్టర్ యుగంధర్, అదనపు కమిషనర్ రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల సమస్యలతో వచ్చిన వారికి ప్రభుత్వ, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరికీ పక్కా స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం నగరంలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలపై కమిషనర్ ఆరా తీశారు. మొత్తం 10 పట్టణ కేంద్రాల్లో నూతనంగా 6 ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, వాటిలో నాలుగు కేంద్రాల నిర్మాణాలు పూర్తి అయినట్లు డీఈఐ, అదనపు కమిషనర్ తెలియజేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందే సేవలు ప్రజలు వినియోగించుకునేలా ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బందిని అప్రమత్తంగా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సారిక, తదితరులు పాల్గొన్నారు.